

కూకట్‌పల్లి ఇంటర్ ద్వితీయ పరీక్షా కేంద్రంవద్ద విద్యార్థులు

ఇంటర్ సెకండియర్ తొలిరోజు పరీక్ష ప్రశాంతం

37 కేంద్రాలలో 170 మంది విద్యార్థుల గైర్హాజరు

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ద్వితీయసంవత్సరం తొలి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి పరిధిలోని 37 పరీక్షా కేంద్రాలలో 17,861 విద్యార్థులకు గాను 17,691 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 170 మంది పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలలో తొలి రోజు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షాకేంద్రాలకు ఉదయం 8గంటలవరకే విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా పరీక్షలు సజావుగా జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.



మూసాపేటలో చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావుతో మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్‌కుమార్

మూసాపేటలో చలివేంద్రం ప్రారంభం

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం మూసాపేటలో ఆర్యవైశ్యసంఘం.. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వరంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సేవాభావంతో ప్రజల దప్పిక తీరుస్తున్న ట్రస్టుసభ్యులను అభినందించారు. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూముశ్రవణ్‌కుమార్, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీషబాబురావు, గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లాగోపాల్, శేఖర్, నేతిరాములు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో చెక్కు పంపిణీ

ఎమ్మెల్యే కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో ఫతేనగర్‌కు చెందిన కవితకు రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పేద బలహీనవర్గాలకు చెందినవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

పలు శుభకార్యాలకు హాజరు

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజవర్గ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కుమార్తె, జోగిపేట శ్రీనివాస్ ముదిరాజ్ కుమార్తె వివాహానికి మాధవరం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం నియోజవర్గ పరిధిలోని పలు శుభకార్యాలకు ఆయన హాజరయ్యారు.



కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే వివేక్‌పై ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్‌పై ఫిర్యాదు

హైదర్‌నగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మీద సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్న బీఆర్ఎస్ పార్టీ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్ అనుచరుడు చాంద్‌పాషా అనే వ్యక్తిమీద చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్‌రెడ్డి, సాధు, ప్రతాప్‌రెడ్డి, సంజీవ్‌రావు, వినయ్‌కుమార్, మేకల దేవసాయం, రవి, బాబురావు, రాజుముదిరాజ్, గోపాల్‌చౌదరి ఉన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు యామిని దంపతులు

ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ

హైదర్‌నగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణంలో నూతనంగా కాశీవిశ్వనాథ సహిత అన్నపూర్ణేశ్వరి దేవాలయ నిర్మాణం పనులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతులు భూమి పూజ చేశారు. ఆ పరమశివుని ఆలయ నిర్మాణ పనులు ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తికావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానికులు నాయినేని సుదర్శన్‌రావు, సూర్యారావు, కుర్మయ్యగారి సుదర్శన్‌రావు, వడ్డేపల్లి భూపతిరావు, వడ్డేపల్లి మురళీధర్‌రావు, గొట్టిముక్కల భాస్కర్‌రావు, భగవాన్, కిశోర్, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతమైన జీవనం

ఫతేనగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఓం శాంతి, ధ్యాన నియమాలతో ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చునని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం ఫతేనగర్ డివిజన్ గౌతమీనగర్ గీత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఓం శాంతి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివేకానందానగర్ ఓం శాంతి ఇన్‌చార్జి జ్యోతిబహెన్, బాలానగర్ ఇన్‌చార్జి మాధవి బహెన్, సుధాకర్, చందు పాల్గొన్నారు.



ఓంశాంతి ధ్యాన యోగ సెంటర్ నిర్వాహకులతో కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఆహారం.. మారుద్దాం

- ఆరోగ్యం కోసం జొన్న రొట్టెకు పెరుగుతున్న ఆదరణ
- ఆశావహ జీవనశైలికి నిదర్శనమంటున్న నిపుణులు



రొట్టెలను ప్యాక్ చేయించి తీసుకెళుతున్న యువతి

రోగనిరోధక శక్తిని పెంచుతాయి



జొన్న రొట్టెలు జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడమే కాక రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. జొన్నలు గ్లూటెన్-ఫ్రీ, తక్కువ కార్బోహైడ్రేట్స్ కల్గి ఉంటాయి. వీటివలన హృదయ, ఎముకల పటుత్వం మెరుగుపడుతుంది. ఐరన్ అధికంగా ఉండటం కారణంగా రక్తహీనతకు మేలు చేస్తుంది. మరీ అధికంగా తీసుకుంటే గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్యలు తలెత్తవచ్చు

– శ్రీజ, డైటీషియన్

అల్లాపూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా జీవనశైలిలో మార్పులు రావడం సహజం. ప్రస్తుత పరిస్థితుల్లో ఆహారపు అలవాట్లు కూడా ఆశావహ దృక్పథం దిశగా పయనిస్తున్నాయి. ఆలుమగలు ఇద్దరూ ఉద్యోగస్తులైనప్పుడు ఇంటిభోజనం అన్ని వేళలా కుదరదు. ఏదో ఒకపూట బయటనుంచి తెచ్చుకుని తిని.. పూట గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇది ఇలాఉండగా, పెద్ద వయస్కులు, షుగర్ పేషంట్లు.. ఇలా వివిధ కారణాలతో చిరుధాన్యాలు, జొన్న రొట్టెలు వంటి వంటలపై ఆధారపడుతున్నారు. ఇప్పటి గృహిణులు చాలామందికి అవిచేసే విధానం తెలీదు.. మైదా పిండితో తయారయ్యే పరోటా, నాన్, తందూరి రోటీలలో పిండి పదార్థం తప్పితే అంతగా ప్రయోజనం ఉండదని, అదే జొన్న రొట్టెల్లో పీచుపదార్థం (ఎడిబుల్ ఫైబర్), మంచి పోషకాలతో పాటు సరళంగా జీర్ణమయ్యే గుణం ఉంటుందని న్యూట్రీషన్ రంగ నిపుణులంటున్నారు.

నాన్‌లు, తందూరి రోటీలు తినొద్దు



ప్రకృతి ఎవరికి ఏం అవసరమో అవే అందించింది. మనవి ఉష్ణ ప్రాంతాలు, జొన్న సరైన ఆహారం. జొన్న రొట్టెల్లోని పీచు పదార్థాల కారణంగా అన్ని వయసుల వారికి ఇది బాగా జీర్ణం అవుతుంది, కాన్‌స్టిపేషన్ సమస్య ఉంటే తగ్గుతుంది. డయాబెటిస్ ఉన్న వారికి కూడా ఉపయోగకరం. రెస్టారెంట్లలో దొరికే నాన్‌లు, తందూరి రోటీలు మైదాతో చేసిన దానికన్నా ఇలా జొన్న రొట్టెలను తినటం ఎంతో మేలు చేస్తుంది.

– డా.శ్రీనివాస్, ఫిజీషియన్

ఆహారపు అలవాట్లలో మార్పు

కరోనా, లాక్‌డౌన్ సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు వెళ్లని పరిస్థితుల్లో అంతా స్వయంపాకం, రోగనిరోధకత, పౌష్టిక ఆహార ప్రాధాన్యతను ప్రజలు గ్రహించారు. అప్పట్లో ఇంటిభోజనం అలవాటు విశిష్టతను కూడా వారు చవిచూశారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి మృతి

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా, మేడారం ప్రాంతానికి చెందిన రాజు(40), మాధవి భార్యాభర్తలు. రాజు సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. నగరంలో ఆస్‌బెస్టాస్ కాలనీలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన రాజు నలభై రోజులుగా పనిచేయకుండా తప్పతాగుతూ తిరుగుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారంలో నష్టం రావడం, ఇప్పించిన అప్పు తిరిగి రాకపోవడంతో అప్పుల పాలైన మహిళ హెయిర్ ఆయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా, రాంపూర్‌కు చెందిన నాగరాజుకు కొంపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న శివరాత్రి దేవి (35)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. వరంగల్‌లో దేవి బట్టల దుకాణం నిర్వహిస్తుండగా, భర్త ఆటో నడిపిస్తున్నాడు. దేవి తన చిన్న అత్తకు కొంతడబ్బును అప్పుగా ఇప్పించింది. ఆమె డబ్బులు కట్టకపోవడం, వ్యాపారంలో నష్టం రావడంతో భర్త అప్పులు కట్టకుండా వేధిస్తుండటంతో ఈనెల 5వ తేదీన దేవి పుట్టింట్లో హెయిర్ ఆయిల్ తాగింది. ఇది గమనించిన ఆమె మరదలు కుటుంబ సభ్యులకు తెలిపింది. దేవిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీల గెలుపుతో బీజేపీ సంబరాలు



కబీర్‌నగర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులతో కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): టీచర్, పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడంపై మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మోతీనగర్ కబీర్‌నగర్ చౌరస్తాలో ఎమ్మెల్సీల గెలుపుపై బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి.. పరస్పరం మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ, బీజేపీ ఎక్కడ విజయం సాధించినా ఈవీఎమ్‌ల టాంపరింగ్ అని చెప్తున్న కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడైనా కనువిప్పు కలగాలన్నారు. రాష్ట్రంలో విద్యావంతులు ఏకమయ్యారనీ తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పారన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ గాలివీస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అన్ని పార్టీలకు తగిన గుణపాఠం చెబుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ డివిజన్‌అధ్యక్షుడు ఎర్రస్వామి, సీనియర్ నాయకులు మల్లేశ్‌గౌడ్, లీగల్‌సెల్ సభ్యులు సద్యుణరెడ్డి, మనోహర్, ఐలయ్యనాగరాజు, శోభారాజన్, శ్రీలత పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో ఆక్రమణల తొలగింపు



కేపీహెచ్‌బీలో ఆక్రమణలను తొలగిస్తున్న పోలీసులు

హైదర్‌నగర్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ కేపీహెచ్‌బీ కాలనీలో పలుచోట్ల రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న పలు దుకాణాలను కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తొలగించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని అత్యంత రద్దీగా ఉండే టెంపుల్ బస్టాప్, తహశీల్దార్ కార్యాలయం రోడ్డు, జేఎన్‌టీయూ నుంచి లూల్‌మాల్ వరకు ఉన్న ఆక్రమణలను జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో తొలగించారు. ఈ సందర్భంగా అడిషనల్ ట్రాఫిక్ డీసీపీ వీరన్న మాట్లాడుతూ, చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను రోడ్లపై నిర్వహించవద్దన్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా పెరుగుతుందన్నారు. దీన్ని నియంత్రించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గురువారం 18 ఆక్రమణలను పోలీసులు తొలగించగా, 20 ఆక్రమణలను వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, సిబ్బంది ఉన్నారు.

తెలంగాణ వైద్యరంగంలో రోబోటిక్ శస్త్రచికిత్స

ప్రవేశపెట్టిన మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి



రోబోటిక్ శస్త్రచికిత్స ప్రారంభోత్సవంలో ఆస్పత్రి యాజమాన్యం

షాపూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్యరంగంలో విప్లవాత్మకమైన ముందడుగు వేస్తున్న మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి రాష్ట్రంలోనే మొట్టమొదటి రోబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థ ఎస్ఎస్ఐ మంత్ర 3.0ను విజయవంతంగా ప్రవేశపెట్టింది. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం రోబోటిక్ చికిత్స గురించి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి విశ్వవిద్యాలయాల చాన్స్‌లర్ కల్పనారెడ్డి మాట్లాడుతూ, అత్యధునిక సాంకేతికత శస్త్రచికిత్సలలో కచ్చితత్వాన్ని పెంచి, సమర్థవంతమైన విధానాలను అందించేందుకు తోడ్పడుతుందన్నారు. అత్యంత ఆధునిక ఆరోగ్యసేవలను అందించడంలో ఆసుపత్రి నిబద్ధతను ఈ ఆవిష్కరణ మరింత బలపరుస్తుందన్నారు. ప్రతిష్టాత్మక ఆవిష్కరణ ఇక్కడ జరగడం విశేషం అన్నారు. ఆసుపత్రి చైర్మన్ భద్రారెడ్డి మాట్లాడుతూ, ఎస్ఎస్ఐ మంత్ర 3.0 వంటి అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థ తెలంగాణ వైద్యరంగాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లనుందన్నారు. శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని పెంచి చికిత్స సమయంలో వచ్చే సంక్లిష్టతలను తగ్గిస్తుందన్నారు. తెలంగాణను రోబోటిక్ శస్త్రచికిత్సా రంగంలో ప్రముఖ స్థానంలో నిలబెట్టేందుకు సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైస్‌చైర్మన్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక శస్త్రచికిత్సా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, చికిత్సా సమర్థతను మెరుగుపరచి, రోగులకు వేగంగా కోలుకొనే మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

- జీడిమెట్లలో 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు
- ఆల్విన్‌కాలనీలో..7 తులాల బంగారం, 10 తులాల వెండి నగలు చోరీ

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధి అపురూపకాలనీలోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి గుర్తుతెలియని దొంగలు 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించుకు పోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన పింటూ అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా అపురూపకాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. స్థానికంగా లేత్ మిషన్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. బుధవారం సొంత రాష్ట్రానికి కుటుంబంతో కలిసి వెళ్లారు. గురువారం ఇంటి పక్కవారు చోరీ గుర్తించి పింటూ కు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం తెలియచేయడంతో క్లూస్‌టీం, పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించారు. ఇంటికిటికి గ్రిల్స్ తొలగించి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్విన్‌కాలనీలో..

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలో గుర్తుతెలియని ఓ మాయలేడి పట్టపగలే ఇంట్లోకి చొరబడి బీరువాలోని 7 తులాల బంగారు నగలు, 10 తులాల వెండి దొంగిలించుకుపోయింది. సీఐ నర్సింహ వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ జలకన్య హోటల్ సమీపంలో కమ్మరి దర్శనం(65) ఆయన భార్య నివాసముంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటి తలుపులు తీసి బయట పక్కింటి వారితో మాట్లాడుతున్నారు. ఇంట్లో అలికిడి కావడంతో దర్శనం లోపలికి వచ్చాడు. 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని మహిళ బీరువాలోని నగలు తీస్తుండగా ఆమెను పట్టుకోవడానికి యత్నించడంతో అతడ్ని తోసివేసి పారిపోయింది. ఈ మహిళ దొంగతనానికి ఇంట్లోకి రాకముందు ఎదురుగా ఉన్న ఫొటో స్టూడియోలో ఫొటోలు దిగి, ఆ తర్వాత డిలీట్ చేయించింది. పోలీసులు రీసైక్లింగ్ బిన్‌లో ఉన్న ఫొటోల ఆధారంగా మహిళను గుర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మహిళా సమాఖ్య సభ్యులకు బహుమతులను అందజేస్తున్న మూసాపేట ఉపకమిషనర్ వంశీకృష్ణ

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు సమాజానికి మూలస్తంభం లాంటి వారని.. వారు అన్ని రంగాల్లో రాణించాలని కోరుకుంటున్నట్లు మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని మూసాపేట సర్కిల్ కార్యాలయంలో మహిళ సమాఖ్య సంఘాలకు చెందిన మహిళలకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఉపకమిషనర్ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్నిరంగాలలో రాణిస్తున్నారని అలాగే క్రీడలు, విద్య, వ్యాపారాల్లో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. మహిళలు సాధికారత, సమానత్వం మహిళా శక్తిని చాటి చెప్పేందుకు ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న మహిళ దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన, కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి రామాలయం గుడి సమీపంలో జలమండలి సిబ్బందికి డ్రైనేజీని చూపిస్తున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లిలో తాగునీటి కలుషితంపై ఫిర్యాదు

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రామాలయం రోడ్డులో డ్రైనేజీ పైపులు, మంచినీటి పైపులైన్‌లు పగిలిపోయి కలుషిత నీరు వస్తుందని బీజేపీ నాయకులు జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా కలుషితనీరు వస్తుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో వాటర్‌బోర్డ్ డీజీఎం నాగప్రియకు ఫోన్‌లో సమస్యను వివరించినట్లు తెలిపారు. దాంతో మేనేజర్ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను పరిశీలించారు. త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ సెల్ కన్వీనర్ చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ నాయకులు శంకర్‌రెడ్డి, సంతోష్‌గుప్తా, విశాల్‌సాగర్, సంతోష్‌గౌడ్, ఆనంద్ శేఖర్‌రావు పాల్గొన్నారు.



బండిరమేష్ నుంచి నియామక పత్రాలను అందుకుంటున్న నాగరాజు

కూకట్‌పల్లి ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా కర్క నాగరాజు

బాలానగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా హెచ్ఏఎల్ కార్మిక నాయకుడు కర్కనాగరాజు నియమితులయ్యారు. ఈ నియామకాన్ని ధ్రువపరుస్తూ మేడ్చల్ జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కూనభరత్‌గౌడ్ నియామక పత్రాన్ని నాగరాజుకు అందజేశారు. గురువారం నాగరాజు బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఇన్‌చార్జిని కలిసి నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, పదవులకే పరిమితం కాకుండా నియోజకవర్గంలో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని నాగరాజుకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మయ్య, కర్కపెంటయ్య, పుష్పమ్మ, ప్రకాష్ యుగంధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అనిల్, హెచ్ఏఎల్ కార్మిక నాయకులు సబ్జితుల్ల, శ్రీకాంత్, వెంకటపతి, నాగార్జున, బాలరాజు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు సన్నాహాలు
- రికార్డుల ప్రకారం పరిశీలిస్తున్న అధికారులు


ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసేందుకు హెచ్చరిక బోర్డులు

గాజులరామారం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. కబ్జాకు గురైన భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, స్వాధీనం చేసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబరు 329, 342, 307ల్లో వెలిసిన కబ్జాలపై అధికారులు చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కోట్ల రూపాయల విలువ చేసే భూములు కబ్జాదారుల చేతుల్లో హారతి కర్పూరంలా కరిగిపోయాయి. ఇప్పటివరకు ఏయే సర్వే నంబర్లలో ఎంతమేర కబ్జా జరిగింది, కబ్జాదారుల ఆధీనంలో ఎంత భూమి ఉందనే విషయాలను రికార్డుల ప్రకారం పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ భూముల్లో వెలిసిన నిర్మాణాలను అధికారులు కూల్చివేసి, కొన్నిచోట్ల హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే సర్వే నంబరు 79, 13, 12ల్లోని ప్రభుత్వ భూముల్లో కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే దేవేందర్‌నగర్ ప్రాంతంలోని కైసర్‌నగర్, రావినారాయణరెడ్డినగర్, కట్టమైసమ్మ బస్తీల్లో కూడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో అక్కడక్కడా వెలిసిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నారు. ఆ స్థలాల్లో బోర్డులను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలుపుతున్నారు.

కేసులు నమోదు చేస్తాం

దేవేందర్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూముల్లో త్వరలోనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. ఎవరైనా తక్కువ ధరకు లభిస్తుందని, ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు. ఎవరైనా కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసులను నమోదు చేస్తాం. - మల్లికార్జునరావు, డిప్యూటీ తహశీల్దార్, కుత్బుల్లాపూర్



అభినందనలు

జాతీయస్థాయిలో స్మార్ట్ పోలీసింగ్ అవార్డు అందుకున్నందుకు గాను జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్‌ను అభినందిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి.

- జీడిమెట్ల 6(ఆంధ్రజ్యోతి)


భక్తులకు తాళిని చూపిస్తున్న వేద పండితులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

పేట్‌బషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లోని గోదావరి హోమ్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్ధశ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు 3 నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయంలో గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా వేద పండితులు, శ్రీశ్రీశ్రీ శతగోప రామానుజ జియర్‌స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులతో పాటు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డి హాజరయ్యారు. శుక్రవారం ఆలయంలో ఆదిత్యహృద సంక్షిప్త రామాయణం, హవనాలు, శ్రీసూక్త సంపటిత ఆయాగ్రీవ హవనాలు, సూర్యప్రవ వాహనంపై పల్లకి సేవ, సామూహిక శ్రీలక్ష్మి కుంకుమార్చన జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు, అధ్యక్షులు తిరుమలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్ మాధవరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంపత్‌మాధవ్‌రెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్, జ్ఞానేశ్వర్, నరేందర్‌రెడ్డి, బాలమల్లేశం, భక్తులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణం కూల్చివేస్తున్న సిబ్బంది


కూల్చివేతలను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

● అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

జీడిమెట్ల, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ సూరారంకాలనీ సిద్ధి వినాయకనగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని హైకోర్టు ఆదేశాల ప్రకారం జీహెచ్‌ఎంసీ అధికారులు గురువారం కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతలు సాగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బందిని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, చారిలు అడ్డుకోవడం వివాదస్పదంగా మారింది. అంతేకాక సూరారం పోలీసులు అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు బందోబస్తు ఇవ్వకపోవడం, కాంగ్రెస్ నాయకులను అడ్డుకోకపోవడంపై విమర్శలు వినవస్తున్నాయి. కోర్టు ఆదేశాల ప్రకారం కూల్చివేతలు చేపట్టిన అధికారుల విధులను అడ్డుకున్న నాయకులపై కేసులు నమోదుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

రాంగ్‌రూట్‌లో ప్రయాణం ప్రమాదం

● నాగరాజ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ



పేట్‌బషీరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్ ప్రయాణంతో ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజ్ అన్నారు. గురువారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ రాంగ్‌రూట్ వాహనదారులపై నూతన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

● **రాంగ్‌రూట్‌పై తీసుకుంటున్న చర్యలు?**
అల్వాల్ స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాం. ఎవరైనా స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడితే ఇబ్బందులు తప్పవన్నారు.

● **రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలతో ప్రమాదాలను ఎలా అరికడతారు?**
పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహదారుల్లో రాంగ్‌రూట్‌లో వచ్చే కూడళ్లను గుర్తించాం. ఈ కూడళ్లలో ఎప్పుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేది వాహనదారులకు కూడా తెలియదు. రాంగ్‌రూట్‌లో వస్తే వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాం.

● **బ్రీత్ అనలైజేషన్ ఎన్ని రోజులకోసారి చేపడుతున్నారు?**
సీపీ ఆదేశాల మేరకు బ్రీత్ అనలైజేషన్ తనిఖీలను నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి పట్టుబడితే కౌన్సెలింగ్‌కి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే కోర్టులో పెనాల్టీని కట్టి వాహనాలు తీసుకెళ్లాలి.

● **రాంగ్‌రూట్‌లో ఎన్ని వాహనాలు పట్టుబడ్డాయి?**
1,700 వందల ద్విచక్ర, 2,200 వందల ఫోర్‌వీలర్ వాహనాలు పట్టుబడ్డాయి. వీటన్నింటికి చలాన్లను విధించాం. ఇప్పటివరకు 11,889 వాహనాలకు చలానాలు విధించాం.

వైద్యరంగంలో రోబోటిక్ శస్త్రచికిత్స

ప్రవేశపెట్టిన మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి


రోబోటిక్ శస్త్రచికిత్స ప్రారంభోత్సవంలో ఆసుపత్రి యాజమాన్యం

షాపూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్యరంగంలో విప్లవాత్మకమైన ముందడుగు వేస్తున్న మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి రాష్ట్రంలోనే మొట్టమొదటి రోబోటిక్ శస్త్రచికిత్స వ్యవస్థ ఎస్ఎస్ఐ మంత్ర 3.0ను విజయవంతంగా ప్రవేశపెట్టిం ది. గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆసుపత్రి యాజమాన్యం రోబోటిక్ చికిత్స గురించి వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి విశ్వవిద్యాలయాల చాన్సలర్ కల్పనారెడ్డి మాట్లాడుతూ, అత్యధునిక సాంకేతికత శస్త్రచికిత్సలలో కచ్చితత్వాన్ని పెంచి, సమర్థవంతమైన విధానాలను అందించేందుకు తోడ్పడుతుందన్నారు. అత్యంత ఆధునిక ఆరోగ్యసేవలను అందించడంలో ఆసుపత్రి నిబద్ధతను ఈ ఆవిష్కరణ మరింత బలపరుస్తుందన్నారు. ప్రతిష్టాత్మక ఆవిష్కరణ ఇక్కడ జరగడం విశేషం అన్నారు. ఆసుపత్రి ఛైర్మన్ బద్రారెడ్డి మాట్లాడుతూ, ఎస్ఎస్ ఐ మంత్ర 3.0 వంటి అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థ తెలంగాణ వైద్యరంగాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లనుందన్నారు.

శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని పెంచి చికిత్స సమయంలో వచ్చే సంక్లిష్టతలను తగ్గిస్తుందన్నారు. తెలంగాణను రోబోటిక్ శస్త్రచికిత్సా రంగంలో ప్రముఖ స్థానంలో నిలబెట్టేందుకు సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైస్‌ఛైర్మన్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ, అత్యాధునిక శస్త్రచికి త్సా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, చికిత్సా సమర్థతను మెరుగుపరచి, రోగులకు వేగంగా కోలుకొనే మార్గాన్ని సుగమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొంపల్లిలో విజయోత్సవ ర్యాలీ

పేట్‌బషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తెలంగాణలో వెలువడిన ఎమ్మెల్సీ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేసిన సందర్భంగా గురువారం కొంపల్లి మున్సిపాలిటీలో విజయోత్సవ బైక్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి ఎమ్మెల్సీ గెలుపొందిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు. తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనమే ఈ ఫలితాలని మల్లారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ శివాజీరాజ్, అశోక్, రాష్ట్ర మహిళా నాయకురాలు సరితారావు, మాధురి, మధు, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కారు బీభత్సం.. తప్పిన ప్రాణాపాయం

నిజాంపేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రగతినగర్ నుంచి బాచుపల్లికి వెళ్లే రోడ్డులో గురువారం ఉదయం 6 గంటల సమయంలో విజ్ఞానజ్యోతి స్కూల్ ముందు విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి అతివేగంగా కారు నడిపి రోడ్డు పక్కన ఉన్న చెరుకు మిషన్ బండి, మొబైల్ సర్వీస్ యాక్సరీస్ స్టాల్‌ను, స్కూల్ ప్రహరీని ఢీకొట్టాడు. కారు నడిపిన వ్యక్తి చింతల్ ఐడీపీఎల్ ప్రాంతంలో నివసిస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ కూడా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు చెరుకుబండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న సాయినగర్‌కు చెందిన పాపయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి మృతి

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా, మేడారం ప్రాంతానికి చెందిన రాజు(40), మాధవి భార్యాభర్తలు. రాజు సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. నగరంలో ఆస్‌బెస్టాస్ కాలనీలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన రాజు నలభై రోజులుగా పనిచేయకుండా తప్పతాగుతూ తిరుగుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జీడిమెట్ల-షాపూర్‌నగర్ మార్గంలో
60 రోజులపాటు ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పైపులైన్ పనుల మరమ్మతుల నిమిత్తం జీడిమెట్ల-షాపూర్‌నగర్ ప్రధాన రహదారిపై వాహనాల మళ్లింపు చేపట్టినట్టు సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసాయి వేబ్రిడ్జి నుంచి రంగా భుజంగా థియేటర్ వరకు ధ్వంసమైన పైపులైన్ స్థానంలో నూతన పైపులైన్ వేయనున్నారు. దాంతో ఈ మార్గంలో 60 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎటు నుంచి ఎటు వైపు..

- సుభాష్‌నగర్ మీదుగా బహదూర్‌పల్లి, గండిమైసమ్మ వైపు వెళ్లే వాహనాలను సాయికాంటా జంక్షన్ వద్ద కుడివైపు తీసుకొని జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా, జేఈటీఎల్ కమాన్, మెయిన్ రోడ్డు, సూరారం, బహదూర్‌పల్లి, గుండ్లపోచంపల్లి చేరుకోవచ్చు.
- గండిమైసమ్మ నుంచి సుభాష్‌నగర్ వైపు వచ్చే వాహనాలను జేఈటీఎల్ కమాన్ వద్ద కుడివైపు మళ్లించి ఇండస్ట్రియల్ ఏరియా, సాయికాంటా మీదుగా రాకపోకలు ఉంటాయి.
- సుభాష్‌నగర్ నుంచి బాలానగర్ వెళ్లే వాహనాలు సాయికాంటా జంక్షన్ వద్ద మళ్లించి సాయిదర్శిని హోటల్ వద్ద ఎడమ వైపు తీసుకొని చింతల్, ఐడీపీఎల్ మీదుగా బాలానగర్‌కు వెళ్లాలి.
- బాలానగర్ నుంచి సుభాష్‌నగర్ వైపు వెళ్లే వాహనాలను సనా బావర్చి హోటల్ వద్ద యూ టర్న్ తీసుకొని ఎడమ వైపు తిరిగి ఆదర్శ్ బ్యాంక్ లేన్ నుంచి సాయికాంటా మీదుగా సుభాష్‌నగర్‌కు వెళ్లాల్సి ఉంటుంది.


క్రయ విక్రయదారులు లేక వెలవెలపోతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం

ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి

షాపూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, సూరారంలో గల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో క్రయ విక్రయాలు జరగక కౌంటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎందుకంటే క్రయ విక్రయాలకు సంబంధించి అధికారులు, ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాకపోవడంతో ఇలా జరుగుతోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఎల్ఆర్ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని ఆన్‌లైన్‌లో చూపించడం వల్ల రిజిస్ట్రేషన్లు జరగక కార్యాలయం వెలవెలబోతుంది.

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకొని 75శాతం డబ్బులు చెల్లించి ఉంటేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో క్రయ విక్రయదారుల్లో అయోమయం నెలకొంది. ఒకవేళ కొనుగోలు చేసిన ప్లాట్ ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా అని కూడా తెలియదు. కొనుగోలు చేసిన తదుపరి ప్రొసీడింగ్ ఆర్డర్ రాకపోతే విక్రయదారుడు నగదు తిరిగి ఇస్తాడా లేదా అని చాలామంది అనుమానపడుతున్నారు. కాబట్టి ఇలాంటి విషయాలపై అధికారులు ప్రజలకు స్పష్టమైన హామీ ఇస్తే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంటుంది. అధికారులు కానీ, ప్రభుత్వం కానీ దీనిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

యునైటెడ్ సా సర్వీసెస్‌కు హైరీచ్ వోల్వో డెమోలిషన్ ఎక్సకవేటర్ అందజేత


జీడిమెట్లలో కాలిపోయిన కంపెనీ కూల్చివేతకు వోల్వో ఎక్సకవేటర్ తాళాన్ని అందిస్తున్న దృశ్యం

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ జీడిమెట్లలోని యునైటెడ్ సా సర్వీసెస్‌కు హైరీచ్ డెమోలిషన్ ఎక్సకవేటర్‌ను అందజేసింది. గురువారం జీడిమెట్లలో రెండు నెలల క్రితం కాలిపోయిన పరిశ్రమను కూల్చివేయడానికి దీనిని వినియోగిస్తున్నారు. వోల్వో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా, సౌత్ అండ్ వెస్ట్ మార్కెట్ ఏరియా హెడ్ సానుజార్జ్, యునైటెడ్ సా సర్వీసెస్ ప్రతినిధి ఎస్.ఎన్.వినోద్‌కుమార్, ఇండియన్ డెమోలిషన్ అసోసియేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ మోహన్ రామనాథన్, ప్రముఖ స్ట్రక్చరల్ కన్సల్టెంట్ జాకీ అహ్మద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ హైరీచ్ డెమోలిషన్ మెషిన్‌ను హైద్రాబాద్‌కు పరిచయం చేస్తున్నందుకు గర్విస్తున్నామన్నారు. ఇది మెరుగైన నియంత్రణ, పర్యావరణంపై తక్కువ ప్రభావాన్ని, సవాళ్లతో కూడిన కూల్చివేత ప్రాజెక్టుల్లో ఎక్కువ కచ్చితత్వాన్ని అందిస్తుందన్నారు. కూల్చివేతలకు ఇది ఒక గేమ్‌చేంజర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామారావు, వినోద్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

క్రైం సమాచారం

- 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు చోరీ


దొంగలు తొలగించిన కిటికి గ్రిల్

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధి అపురూపకాలనీలోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఇంటి కిటికి గ్రిల్స్ తొలగించి గుర్తుతెలియని దొంగలు 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించుకుపోయారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన పింటూ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా అపురూపకాలనీలో కుటుంబంతో నివాసముంటున్నాడు. స్థానికంగా లేత్ మిషన్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. బుధవారం సొంత రాష్ట్రానికి కుటుంబంతో కలిసి వెళ్లారు. గురువారం ఇంటి పక్కవారు చోరీ గుర్తించి పింటూకు సమాచారం అందించారు. పోలీసులకు సమాచారం తెలియచేయడంతో క్లూస్‌టీం, పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించారు. ఇంటి కిటికి గ్రిల్స్ తొలగించి దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలోని 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించుకుపోయినట్టు బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. జీడిమెట్ల పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్విన్‌కాలనీలో..


అనుమానిత మహిళ


జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలో గుర్తుతెలియని ఓ మాయలేడి పట్టపగలే ఇంట్లోకి చొరబడి బీరువాలోని 7 తులాల బంగారు నగలు, 10 తులాల వెండి దొంగిలించుకుపోయింది. సీఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ జలకన్య హోటల్ సమీపంలో కమ్మరి దర్శనం(65) ఆయన భార్య అరుణ నివాసముంటున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి తలుపులు తీసి బయట పక్కింటి వారితో మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారు. ఇంట్లో అలికిడి కావడంతో దర్శనం లోపలికి వచ్చాడు. అప్పటికే దాదాపు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని మహిళ బీరువాలోని బంగారు నగలు, వెండి తీస్తుండగా ఆమెను పట్టుకోవడానికి అతడు ప్రయత్నించాడు. ఆమె అతడ్ని తోసివేసి పారిపోయింది. ఈ మహిళ దొంగతనానికి ఇంట్లోకి రాకముందు ఎదురుగా ఉన్న ఫొటో స్టూడియోలో ఫొటోలు దిగి, ఆ తర్వాత డిలీట్ చేయించింది. పోలీసులు రీ సైక్లింగ్ బిన్‌లో ఉన్న ఫొటోల ఆధారంగా మహిళను గుర్తించటానికి ప్రయత్నిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య


శివరాత్రి దేవి (ఫైల్)

పేట్‌బషీరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారంలో నష్టం రావడం, ఇప్పించిన అప్పు తిరిగి రాకపోవడంతో అప్పుల పాలైన మహిళ హెయిర్ ఆయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా, రాంపూర్‌కు చెందిన నాగరాజుకు కొంపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న శివరాత్రి దేవి(35)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. వరంగల్‌లో దేవి బట్టల దుకాణం నిర్వహిస్తుండగా, భర్త ఆటో నడిపిస్తున్నాడు. దేవి తన చిన్న అత్తకు కొంతడబ్బును అప్పుగా ఇప్పించింది. ఆమె డబ్బులు కట్టకపోవడం, వ్యాపారంలో నష్టం రావడంతో భర్త అప్పులు కట్టకుండా వేధిస్తుండటంతో ఈ నెల 5న దేవి పుట్టింట్లో హెయిర్ ఆయిల్ తాగింది. గమనించిన ఆమె మరదలు కుటుంబ సభ్యులకు తెలిపింది. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలు తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


కాలిపోయిన బైక్

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో గురువారం తెల్లవారుజామున ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. హీరో గ్లామర్ ద్విచక్ర వాహనం కాలిపోతుండటాన్ని గమనించిన స్థానికులు జగద్గిరిగుట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వాహనం కాలిపోతున్న సమయంలో ఓ వ్యక్తి అక్కడ నుంచి పరిగెత్తినట్టు సమాచారం వచ్చిందని పోలీసులు పేర్కొంటున్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కోమటికుంట చెరువుకు ఎన్ఓసీ ఇవ్వొద్దు


అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆకుల సతీష్ బృందం


కోమటికుంట చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో నిర్మిస్తున్న భవనాలు

నిజాంపేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని వాసవి కన్‌స్ట్రక్షన్‌కు అనుకూలంగా ఇరిగేషన్ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు ఆకుల సతీష్ బృందం గురువారం ఫిర్యాదు చేస్తూ, పూర్తి వివరాలను సమర్పించారు. బాచుపల్లిలోని కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఆక్రమించి వాసవి కన్‌స్ట్రక్షన్ 8, 9 బ్లాక్‌లను నిర్మించారు. వీటిపై గతంలో పోలీసు కేసులు కూడా నమోదయ్యాయి. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని, ఎన్‌ఓసీ ఇచ్చిన తర్వాతే నిర్మాణం జరగాలని కోర్టు ఆదేశించింది. అయినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూడగట్టుకొని, కొత్తగా వచ్చిన ఉన్నత స్థాయి ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్ మ్యాప్‌లో డేటాను వక్రీకరించి, కలెక్టర్ కార్యాలయంలో ఎన్‌ఓసీ కోసం సమర్పించడంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ బఫర్‌జోన్లలో నిర్మిస్తున్న నిర్మాణాలకు ఎలాంటి ఎన్‌ఓసీ ఇవ్వకూడదని, ఆ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో శ్రీనివాస్‌గౌడ్, అరుణ్‌రావు, మాధవరావు, శ్యామ్ ఉన్నారు.



సన్మానం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ పరిధిలోని హెచ్ఎంటీ కాలనీలో గల శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ప్రెసిడెంట్, సెక్రటరీలు ఆయనను శాలువాతో సన్మానించారు.

- షాపూర్‌నగర్ 6(ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366

CELEBRATING 26 YEARS OF VIJETHA

ANNIVERSARY CELEBRATIONS

విజేత
Fresh Healthy Living

Product	Pack / MRP	Offer	Price
CABBAGE	PER KG	Vijetha Price	₹9
TOMATO LOCAL	PER KG	Vijetha Price	₹15
CAULIFLOWER	PER PC	Vijetha Price	₹16
KHEERA	PER KG	Vijetha Price	₹19
CARROT	PER KG	Vijetha Price	₹24
BEET ROOT	PER KG	Vijetha Price	₹25
POTATO	PER KG	Vijetha Price	₹26
ONION RED	PER KG	Vijetha Price	₹34
GINGER	PER KG	Vijetha Price	₹49
KIRAN MELON	PER KG	Vijetha Price	₹16
KHARBUJA (MUSK MELON)	PER KG	Vijetha Price	₹35
MOSAMBI	PER KG	Vijetha Price	₹54
GRAPES GREEN SEEDLESS PUNET	PER PUNET	Vijetha Price	₹59
ORANGE NAGPUR	PER KG	Vijetha Price	₹79
SUGAR PREMIUM	1 KG PACK	Vijetha Price	₹49
TOORDAL PREMIUM	1 KG PACK	Vijetha Price	₹149
URAD ROUND PREMIUM	1 KG PACK	Vijetha Price	₹149
GROUNDNUT PREMIUM	1 KG PACK	Vijetha Price	₹168
BASMATHI RICE	1 KG PACK	Vijetha Price	₹99
AADHAAR SUNFLOWE OIL 1LTR POUCH	MRP ₹ 188	Vijetha Price	₹139 ONLY
RAAGA SUNFLOWER OIL 1LT POUCH	MRP ₹ 165	Vijetha Price	₹139 ONLY
SAFFOLA OIL GOLD 5LT (GET 5KG AASHIRVAAD POPULAR ATTA WORTH ₹355/-)	MRP ₹ 1182	Vijetha Price	FREE
GOLD DROP SUNFLOWER OIL 1 Ltr POUCH	MRP ₹ 165	Vijetha Price	₹147 ONLY
SAFFOLA OIL ACTIVE 1LT	MRP ₹ 197	Vijetha Price	₹138 ONLY
ORIGINAL KIMIA DATES 400G BOX	MRP ₹ 310	Vijetha Offer	BUY 1 GET 1 FREE
COCOJAL TENDER COCONUT WATER 200ML	MRP ₹ 55	Vijetha Offer	BUY 1 GET 1 FREE
BNATURAL JUICE 1LT (APPLE/GUAVA/LICHI/MIXED FRUIT MBY/ORANGE)	MRP ₹ 140	Vijetha Offer	BUY 1 GET 1 FREE
COCO ROYAL BASIL SEED 290ML (ENTIRE RANGE)	MRP ₹ 99	Vijetha Offer	BUY 1 GET 1 FREE
MAAZA MANGO PET 1.75LT	MRP ₹ 105	Vijetha Offer	₹30 OFF ON MRP
MINUTE MAID PET PULPY ORANGE 1LT	MRP ₹ 90	Vijetha Offer	₹15 OFF ON MRP
COKE ZERO SUGAR PET 750ML	MRP ₹ 45	Vijetha Offer	BUY 1 GET 1 FREE
SUNFEAST MOMS MAGIC CASHEW&ALMOND COOKIES 94.5G	MRP ₹ 35	Vijetha Offer	BUY 1 GET 1 FREE
SUNFEAST YIPPEE NOODLES MAGIC MASALA 280G	MRP ₹ 56	Vijetha Offer	₹20 OFF ON MRP
TAJ MAHAL TEA LEAF 500G	MRP ₹ 470	Vijetha Offer	₹75 OFF ON MRP
PARACHUTE ADVANCED GOLD COCONUT HAIR OIL 500ML	MRP ₹ 400	Vijetha Offer	BUY 1 GET 1 FREE
PARACHUTE COCONUT OIL 600ML	MRP ₹ 305	Vijetha Offer	₹75 OFF ON MRP
SURF EXCEL MATIC LIQUID FRONT LOAD4LTR	MRP ₹ 885	Vijetha Offer	₹265 OFF ON MRP
SURF EXCEL SOAP200G*4 BAR 800G SET	MRP ₹ 125	Vijetha Offer	₹20 OFF ON MRP
VIM ANTI SMELL BAR 5X200G	MRP ₹ 130	Vijetha Offer	₹40 OFF ON MRP
PONDS TALC MAGIC / DREAM FLOWER 400G / SANDAL 300G	MRP ₹ 300-459	Vijetha Offer	BUY 1 GET 1 FREE
VIM DROP LIQUID LEMON 2LT POUCH	MRP ₹ 405	Vijetha Offer	₹70 OFF ON MRP
MANGALDEEP AGARBATHI SANDLE 160 STICKS	MRP ₹ 120	Vijetha Offer	BUY 1 GET 1 FREE

OFFERS VALID FROM 7th TO 9th MARCH 2025 ONLY. VISIT OUR STORE FOR MANY MORE OFFERS

VIJETHA Fresh Healthy Living

Vijetha Supermarkets Pvt. Ltd.

Telangana • Andhra Pradesh

Address: HO. 5-4/6, Balaji Towers, Chandanagar, Hyderabad - 500050

vijethasupermarkets | VijethaSuperMarketsPvtLtd

SINCE 1999 In Customer Service

ఓబీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ తరపున జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, తెలంగాణ మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్‌తో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగించి ఓబీసీలకు వారి సామాజిక, విద్యా వెనుకబాటు తనాన్ని ఆధారంగా చేసుకొని ప్రామాణిక ప్రాతిపదికన ప్రాతినిథ్యం కల్పించాలని సీఎంను కోరారు. రాష్ట్రంలో ఓబీసీలకు విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారని వారు పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

హైదర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీకార్య సిద్ధి అభయాంజనేయస్వామి ఆలయ 5వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్, ప్రసాద్, నాని, నాగేశ్వరరావు, కృష్ణంరాజు, కుమార్, భక్తులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ శాతవాహన కోఆపరేటివ్ అసోసియేషన్ కార్యాలయం ప్రారంభం

హైదర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీలో కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ కార్యాలయాన్ని కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ నూతన కార్యాలయం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమావేశాలు, చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించుకోడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, స్థానికంగా ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షుడు రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు బాబురావు, జనరల్ సెక్రటరీ యాదిరెడ్డి, జాయింట్ సెక్రటరీ సీవీఆర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్‌రావు, రమానాథం, కాలనీ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు చీఫ్ ప్యాట్రన్ రామకోటేశ్వరరావు, మెంబర్లు బాబురావు, యాదిరెడ్డి, రాజు, హన్మంతరాజు, నాయకులు ప్రసాద్, రాజేందర్, దేవేందర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ జంక్షన్ రోడ్డులో మరమ్మతులు

- 2 రోజులు ట్రాఫిక్ మళ్లింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ జంక్షన్‌లో ప్రధాన రహదారిలో మరమ్మతు పనులు చేపడుతుండడంతో 2 రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. జలమండలి బీహెచ్‌ఈఎల్ వద్ద జాతీయ రహదారిపై పైపులైన్ పనులు చేపడుతుండడంతో ఈ నెల 7, 8వ తేదీల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్‌సీ పురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఈవిషయాన్ని గుర్తించి తమ ప్రయాణ మార్గాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. పైపులైన్ నిర్మాణ పనులు సాఫీగా జరిగేందుకు వాహనదారులు సహకరించాలని కోరారు. పటాన్‌చెరువు నుంచి చందానగర్ వెళ్లే ట్రాఫిక్‌ను కొత్తగా నిర్మిస్తున్న బెల్ ఫ్లైఓవర్ వద్ద మళ్లించనున్నారు. అదేవిధంగా పటాన్‌చెరువు నుంచి లింగంపల్లి-నల్లగండ్ల వెళ్లే ట్రాఫిక్‌ను సీఎంఆర్ షాపింగ్‌మాల్, అండర్ పాస్ నుంచి లింగంపల్లి వెళ్లేలా మార్గాన్ని నిర్ణయించారు. అమీన్‌పూర్ నుంచి చందానగర్ వెళ్లే ట్రాఫిక్‌ను శ్రీదేవి థియేటర్ వద్ద కుడి వైపు మళ్లించి బీహెచ్‌ఈఎల్ ఎక్స్ మీదుగా చందానగర్ చేరుకునేలా ట్రాఫిక్‌లో మార్పులు చేశామని పోలీసులు తెలిపారు.

'మసీద్‌లు, ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయాలి'

గచ్చిబౌలి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం పురస్కరించుకొని మసీద్‌ల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని శేరిలింగంపల్లి ఎంఐఎం అధ్యక్షుడు ఎండీ నజీర్‌ఖాన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రార్థనా మందిరాల వద్ద తాగునీరు, పరిశుభ్రత, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈద్గాల వద్ద కూడా పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన వినతి పత్రంలో కోరారు. రంజాన్ మాసం ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా ఎలాంటి సదుపాయాలు కల్పించలేదని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన జడ్‌సీని కోరారు.

అరవిందబాయికి నివాళి

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సీనియర్ బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాతృమూర్తి అరవింద బాయి అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. గురువారం ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, బొంతు రామ్మోహన్, నార్నె శ్రీనివాసరావు, మాధవరం కృష్ణారావు, పరంపర స్వీట్స్ ఎండీ ప్రవీణ్, కన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ మాధవరం నర్సింగ్‌రావు, స్థానిక నాయకులు, మహిళ నాయకురాళ్లు, పలు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. సాయిబాబాను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ

కూకట్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళలు సమాజానికి మూల స్తంభం లాంటి వారని.. వారు అన్ని రంగాలలో రాణించాలని కోరుకుంటున్నట్లు మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్ వంశీకృష్ణ అన్నారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవం పురస్కరించుకుని మూసాపేట సర్కిల్ కార్యాలయంలో మహిళా సమాఖ్య సంఘాలకు చెందిన మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఉపకమిషనర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, అలాగే క్రీడలు, విద్య, వ్యాపారాల్లో మరింత ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. మహిళలు సాధికారత, సమానత్వం మహిళా శక్తిని చాటి చెప్పేందుకు ప్రపంచ వ్యాప్తంగా మార్చి 8న మహిళ దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి ఇంద్రసేన, కమ్యూనిటీ ఆర్గనైజర్ మురళి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొద్దిపాటి అప్రమత్తతతో..

- అందుబాటులోకి వచ్చిన ఎక్స్‌టీం విషర్లతో మరింత భద్రత

అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట



ఖైల్‌కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఒక్కోసారి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ అగ్ని ప్రమాదాలు సంభవించి ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తూనే ఉంటున్నాయి. కొద్ది పాటి నిర్లక్ష్యం వల్ల నష్టాన్ని చవిచూడాల్సివస్తోంది. నిప్పుతో ఎంత ఉపయోగమో నిర్లక్ష్యంగా ఉంటే అంతే ప్రమాదంకూడా ఏర్పడుతుంది. అందుకే ప్రమాదానికి కారణమయ్యే చిన్నచిన్న లోపాలను కనిపెట్టి సరిదిద్దుకుంటే నివారించొచ్చు. ముఖ్యంగా షాట్ సర్క్యూట్‌ల వల్ల సంభవించే ప్రమాదాల వల్ల ప్రాణాపాయం జరిగే అవకాశం అధికంగా ఉంటుంది. ప్రమాదాల నివారణకు నేడు ఎన్నోరకాల భద్రతా పరికాలు, ఫైర్ ఎక్స్‌టీం విషర్లు అందుబాటులోకి వచ్చాయి. సామాన్యులకు అందుబాటు ధరల్లో వంటింటి గదుల్లో వాడే ఎక్స్‌టీం విషర్‌లు, పరికరాలు దొరుకుతున్నాయి.

ఫైర్ ఎక్స్‌టీం విషర్‌లు..

వంటింటి గదికి దగ్గరలో నిప్పు ఆర్పే యంత్రాలను (ఫైర్ ఎక్స్‌టీం విషర్‌లు) అందుబాటులో ఉంచుకోవాలి. అకస్మాత్తుగా ఎగిసిన మంటలను క్షణాల్లో అవి అదుపులోకి తెస్తాయి. అనుకోని అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఇవి ఎంతో ఉపయోపడుతాయి. కార్బన్ డాయాక్సైడ్ ఎక్స్‌టీంవిషర్‌లు సాధారణంగా పది అడుగల వరకూ పని చేస్తాయి. ఏబీసీడీలుగా విభజించపడిన ఎక్స్‌టీం విషర్‌లు ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేకతలు ఉన్నాయి.

అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు..

కార్బన్ డయాక్సైడ్‌కు మండే గుణం ఉండదు కాబట్టి దీనిని ద్రవ పదార్థంగా మార్చి సిలిండర్ లోకి పంపి భద్రపరుస్తారు. దీనిని వాడే సమయంలో కార్బన్ డయాక్సైడ్ అగ్ని సంభవించిన ప్రాంగణాన్ని చల్లార్చడంతో పాటు వేడిని తగ్గిస్తుంది. దీనివల్ల మంటలు అదుపులోకి వస్తాయి. ఇటువంటి వాటిని వంట గదుల్లో, బెడ్ రూమ్, స్టోర్‌రూంల్లో ముఖ్యంగా అమర్చుకోవాలి. హాల్‌లో ఎక్స్‌టీం విషర్‌లు, వాటర్ ఎక్స్‌టీం విషనర్‌లు అందుబాటులో ఉంచుకోవాలి. అవి విద్యుత్ షాట్ సర్క్యూట్‌లు, పెట్రోల్, కిరోసిన్, డీజిల్ తదితర వాటి వల్ల సంభవించే అగ్ని ప్రమాదాలను అరికట్టేందుకు చాలా ఉపయోగ పడతాయి.

అవగాహన పెంచుకోవాలి...

ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ, జాగ్రత్తగా మసులుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు. భద్రతపై నియమాలు, ఆచరణ విదానాలపై అవగాహన పెంచుకోవాలి. వంట గదులలో గ్యాస్ స్టవ్‌ల వాడకం, విద్యుత్ వైర్‌ల ఏర్పాటు తదితర వాటిలోనూ నాణ్యమైన ఉత్పత్తులను వాడడంతోపాటు భద్రత పాటించాలి. ప్రతిపనిలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా బావిస్తూ అందరికీ సంబంధించిన విషయమనే అవగాహన కల్పించిన నాడే ప్రమాదాలను నివారించవచ్చు.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు..

వంటింటి గదుల్లో పూర్తి స్థాయిలో వెంటిలేషన్ లేకపోవడం, భద్రతా చర్యలు పాటించక పోవడంవల్లే అధికంగా ప్రామాదాలు సంభవిస్తున్నాయి. దుకాణాల్లో సైతం వ్యాపార్లు చిన్నచిన్న భద్రతా చర్యల విషయంలో నిర్లక్ష్య ధోరిణిని అవలంబిస్తుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. నాణ్యతలేని విద్యుత్ పరికాలు, వంటింటిలో కాలం చెల్లిన గ్యాస్ ట్యూబ్‌లు వాడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రశాంతంగా ఇంటర్ సెకండియర్ పరీక్ష



గదుల వివరాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

ఖైల్‌కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు తల్లితండ్రులతో కలిసి పరీక్ష కేంద్రానికి 8 గంటలకే చేరుకున్నారు. బుధవారం పలుచోట్ల విద్యార్థులు ఎదుర్కొన్న ట్రాఫిక్ ఇబ్బందులు, సెంటర్ గుర్తింపులో తలెత్తన సమస్యలు ప్రసార మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో గురువారం జరిగే పరీక్షకు విద్యార్థులు ముందస్తుగానే కేంద్రానికి చేరుకున్నారు.అధికారులు విద్యార్థులను పూర్తిస్థాయి తనికీలు చేపట్టి పరీక్ష కేంద్రంలోకి అనుమతించగా నిర్ధేశించిన సమయంలో పరీక్షను ప్రారంభించారు. కేంద్రంలో మొత్తం 835 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి అధికారులు ఏర్పాటు చేయగా 826 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నల్లగండ్ల ఫ్లైఓవర్‌పై జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు

ఖైల్‌కాలనీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నల్లగండ్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, పారిశుధ్య నిర్వహణపై జనసేన ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్రిడ్జి ప్రాంగణంలో పర్యటించి, జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాల వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకుని, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫొటోలతో పాటు ఫిర్యాదు చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఫ్లైఓవర్ పరిస్థితి చూడరూ'..! శీర్షికపై స్పందిస్తూ శేరిలింగంపల్లి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మాధవరెడ్డి బ్రిడ్జి ప్రాంగణంలో పర్యటించి, నిర్వహణపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణ సమస్య తీవ్రంగా ఉందని, నిర్మాణ వ్యర్థాలు, చెత్తా చదారంతో ఈ ప్రాంగణం దుర్గంధ భరితంగా మారిందన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న అప్రోచ్ రోడ్డుపై వాహనాల రాకపోకలు ప్రమాద భరితంగా మారాయని, నిబంధనలకు విరుద్ధంగా వస్తున్న భారీ వాహనాలతో ఇక్కడ ప్రజలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. బ్రిడ్జి కింద గంజాయి తాగడంతో పాటు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ ఆలయం ఉండడంతో మహిళలు రావడానికి భయపడుతున్నారు. విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల ఇక్కడ అసాంఘిక శక్తులు అడ్డాగా మార్చుకున్నారని తెలిపారు. దీనిపై జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదు చేశామన్నారు. జనసేన ప్రతినిధులు ఉలిసి శ్రీనివాసరావు, రాహుల్, రామాంజనేయులు, సాయికృష్ణ, అడ్డాల భూలోకరావు, సురేష్ పాల్గొన్నారు.



రోడ్లపై వేసిన కేబుల్ వైర్లను పరిశీలిస్తున్న జనసేన ప్రతినిధులు

ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్..

- గంజాయి, హెరాయిన్ స్వాధీనం



నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్, గంజాయిని చూపుతున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌ను విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర నేరగాళ్లను ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్ చేశారు. బిహార్‌కు చెందిన చంద్ర నరేష్ సాహిని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుభోల్ బిశ్వాస్ గుట్టుచప్పుడు కాకుండా గంజాయి, హెరాయిన్ విక్రయిస్తున్నారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్టు పక్కా సమచారమందుకున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిఘాపెట్టారు. డ్రగ్స్ విక్రయించేందుకు వచ్చిన సుభోల్, చంద్రనరేష్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 2లక్షల విలువైన 3.10 కిలోల గంజాయి, 7.50 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

- జీడిమెట్లలో 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు
- ఆల్వీన్‌కాలనీలో..7తులాల బంగారం, 10తులాల వెండి నగలు చోరీ

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధి అపురూపకాలనీలోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించి గుర్తుతెలియని దొంగలు 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతాకు చెందిన పింటూ అనే వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా అపురూపకాలనీలో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. స్థానికంగా లేత్ మిషన్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. బుధవారం సొంత రాష్ట్రానికి కుటుంబంతో కలిసి వెళ్లారు. గురువారం ఇంటి పక్కవారు చోరీ గుర్తించి పింటూకు సమాచారం ఇచ్చారు. పోలీసులకు సమాచారం తెలియజేయడంతో క్లూస్‌టీం, పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించారు. బీరువాలోని 20 తులాల బంగారు నగలు, రూ.30వేల నగదు దొంగిలించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. జీడిమెట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్వీన్‌కాలనీలో..

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీలో గుర్తుతెలియని ఓ మహిళ పట్టపగలే ఇంట్లోకి చొరబడి బీరువాలోని 7 తులాల బంగారు నగలు, 10 తులాల వెండి దొంగిలించుకుపోయింది. సీఐ నర్సింహ వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ జలకన్య హోటల్ సమీపంలో కమ్మరి దర్శనం(65) ఆయన భార్య నివాసముంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటి తలుపులు తీసి బయట పక్కింటి వారితో మాట్లాడుతున్నారు. ఇంట్లో అలికిడి కావడంతో దర్శనం లోపలికి వచ్చాడు. గుర్తుతెలియని మహిళ(35) బీరువాలోని నగలు తీస్తుండగా ఆమెను పట్టుకోవడానికి యత్నించగా, ఆమె పారిపోయింది. మహిళ దొంగతనానికి ఇంట్లోకి రాకముందు ఎదురుగా ఉన్న ఫొటో స్టూడియోలో ఫొటోలు దిగి, ఆ తర్వాత డిలిట్ చేయించింది. పోలీసులు రీసైక్లింగ్ బిన్‌లో ఉన్న ఫొటోల ఆధారంగా మహిళను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడం, ఇప్పించిన అప్పు తిరిగి రాకపోవడంతో అప్పుల పాలైన మహిళ హెయిర్ ఆయిల్ తాగి ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పేట్‌బషీరాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా, రాంపూర్‌కు చెందిన నాగరాజుకు కొంపల్లి ప్రాంతంలో నివాసం ఉంటున్న శివరాత్రి దేవి (35)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. వరంగల్‌లో దేవి బట్టల దుకాణం నిర్వహిస్తుండగా, భర్త ఆటో నడిపిస్తున్నాడు. దేవి తన చిన్న అత్తకు కొంతడబ్బును అప్పుగా ఇప్పించింది. ఆమె డబ్బులు కట్టకపోవడం, వ్యాపారంలో నష్టం రావడంతో భర్త అప్పులు కట్టకుండా వేధిస్తుండడంతో ఈనెల 5న దేవి పుట్టింట్లో హెయిర్ ఆయిల్ తాగింది. గమనించిన ఆమె మరదలు కుటుంబ సభ్యులకు తెలిపింది. దేవిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి

- అంబేడ్కర్ వర్సిటీ అకడమిక్ డైరెక్టర్ ప్రొ. పుష్పాచక్రపాణి



అంబేడ్కర్ వర్సిటీలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంపై కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ అవగాహన కల్పిస్తున్న కోచ్

హైదరాబాద్ సిటీ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా మహిళల క్రీడా వారోత్సవాల్లో భాగంగా డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో వాకో ఇండియా, కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ సంయుక్తంగా కిక్ బాక్సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'స్త్రీలు, బాలికలకు - హక్కులు, సమానత్వం, సాధికారత' అనే అంశంపై ఆమె ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో సమాన భాగస్వామ్యం కలిగి ఉండాలని, వారి హక్కులను గౌరవించాలని, శారీరకంగా, మానసికంగా, వేధింపులకు గురిచేయరాదని పేర్కొన్నారు. ప్రజా స్వామ్య పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ డా. ఎల్వీకే రెడ్డి మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో కిక్ బాక్సింగ్‌లో బంగారు పతక విజేతగా నిలిచిన ప్రవీణ్ కుమార్ డా. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ విద్యార్థి కావడం, ఇదే వేదికపై ప్రవీణ్ కుమార్‌ను సన్మానించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సి.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం.మహిపాల్, కోచ్ సురేష్ పాటిల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశం పాల్గొన్న 10 మంది క్రీడాకారులు, యూజీసీ- డెబ్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొ. పల్లవీ కాబ్డే, విశ్వవిద్యాలయ మహిళా విభాగ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ. మేరీ సునంద, డా. కె.శ్రీదేవి, డా.రజనీ, డా.ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి'

షాపూర్‌నగర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్, సూరారంలో గల రిజిస్ట్రేషన్ కార్యాలయం క్రయ విక్రయాలు జరగక కౌంటర్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎందుకంటే క్రయ విక్రయాలకు సంబంధించి అధికారులు, ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు రాకపోవడంతో ఇలా జరుగుతోందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని ఆన్‌లైన్‌లో చూపించడం వల్ల రిజిస్ట్రేషన్లు జరగక కార్యాలయం వెలవెలబోతుంది. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకొని 75శాతం డబ్బులు చెల్లించి ఉంటేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది. దీంతో క్రయ విక్రయదారుల్లో అయోమయం నెలకొంది. ఒకవేళ కొనుగోలు చేసిన ప్లాట్ ఎఫ్‌టీఎల్‌లో ఉందా, బఫర్‌జోన్‌లో ఉందా అని కూడా తెలియదు. కొనుగోలు చేసిన తదుపరి ప్రొసీడింగ్ ఆర్డర్ రాకపోతే విక్రయదారుడు నగదు తిరిగి ఇస్తాడా లేదా అని చాలామంది అనుమానపడుతున్నారు.

కాబట్టి ఇలాంటి విషయాలపై అధికారులు ప్రజలకు స్పష్టమైన హామీ ఇస్తే రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశం ఉంటుంది. అధికారులు కానీ, ప్రభుత్వం కానీ దీనిపై స్పష్టమైన హామీ ఇవ్వాలని వినియోగదారులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ల తొలగింపు

- రోడ్ల విస్తరణలో భాగంగా తొలగిస్తున్న అధికారులు
- బస్సుల కోసం రోడ్లపై ఎండలోనే పడిగాపులు
- ఇబ్బంది పడుతున్న వృద్ధులు, విద్యార్థులు, మహిళలు



గచ్చిబౌలిలో బస్ షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపైనే వేచివున్న ప్రయాణికులు

రాయదుర్గం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తర్ణ పేరుతో ప్రధాన రహదారులపై ఉన్న బస్‌షెల్టర్లను తొలగించడంతో ప్రయాణికులు ఎండలోనే పడిగాపులు కాయాల్సివస్తోంది.

గచ్చిబౌలి, రాయదుర్గం, గచ్చిబౌలి సర్కిల్, మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, గోపన్‌పల్లి తాండ, ఎన్టీఆర్‌నగర్, నల్లగండ్ల, కొండాపూర్, 8వ బెటాలియన్, అంజయ్యనగర్, గచ్చిబౌలి ఇందిరానగర్ ప్రాంతాల్లో బస్సులు ఎక్కాలంటే ప్రయాణికులు రోడ్డుపై ఎండలోనే గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో చెట్లు, దుకాణాల నీడను ఆశ్రయిస్తున్నారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఎండకు తట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు. రాయదుర్గం, నానక్‌రాంగూడలో ఉన్న బస్టాప్‌లను రోడ్ల విస్తర్ణ పేరుతో తొలగించారు. దీంతో చాలా వరకు బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్సులు ఆగే చోట షెల్టర్లు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో బస్‌షెల్టర్స్ ఉన్నపట్టికీ అవి ఉపయోగంలో లేకుండా పోయాయి. కనీసం ప్రయాణికులు నిలబడేందుకు నిలువ నీడకూడా లేదు.

బస్సుల కోసం పడిగాపులు

రోడ్డు విస్తర్ణ పేరుతో బస్‌షెల్టర్లు తొలగించారు. దీంతో బస్సుల కోసం ఎండలోనే వేచివుండాల్సి వస్తోంది. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. షెల్టర్లు తొలగించి నెలలు గడుస్తున్నా తిరిగి ఏర్పాటు చేయలేదు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి వేసవిని దృష్టిలో ఉంచుకొని షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

- నర్సింహ, రాయదుర్గం

ఎండలో నిలబడలేకపోతున్నాం

రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. బస్సుల కోసం ఎండలో నిలబడలేక పోతున్నాం. కనీసం వేసవిని దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

- శిరీష, గచ్చిబౌలి

వ్యక్తి మృతి

జీడిమెట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా, మేడారం ప్రాంతానికి చెందిన రాజు(40), మాధవి భార్యాభర్తలు. రాజు సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. నగరంలో ఆస్‌బెస్టాస్ కాలనీలో నివాసముంటున్నారు. మద్యానికి బానిసైన రాజు 40 రోజులుగా పనిచేయకుండా తాగుతూ తిరుగుతున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు బీభత్సం.. తప్పిన ప్రాణాపాయం

నిజాంపేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రగతినగర్ నుంచి బాచుపల్లికి వెళ్లే రోడ్డులో గురువారం విజ్ఞానజ్యోతి స్కూల్ వద్ద విష్ణువర్ధన్‌రెడ్డి కారు అతివేగంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న చెరుకు మిషన్ బండి, మొబైల్ సర్వీస్ యాక్సరీస్ స్టాల్‌ను, స్కూల్ ప్రహరీని ఢీకొట్టాడు. కారు నడిపిన వ్యక్తి చింతల్ ఐడీపీఎల్ ప్రాంతంలో నివసిస్తున్నట్టు బాచుపల్లి పోలీసులు తెలిపారు. కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ కూడా ఉన్నట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఉపేందర్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086